క్లుప్తంగా

ఆడ పిల్ల చదువు.. ఇంటికి వెలుగు



కాజీపేట: ఆడ పిల్లలు చదువుకుంటే ఆ ఇంటి లోని వారంతా చైతన్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని కాజీపేట పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు అంగన్‌వాడీ కేంద్రం సేవలపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లల చదువు, మానవ అక్రమ రవాణా, తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో ఎం.మానస, వాసవిదేవి, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ హిమోఫిలియా మందుల అందజేత



ఎంజీఎం: హిమోఫిలియా సొసైటీ, వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో హిమోఫిలియా ఫెడరేషన్ సహకారంతో హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు (ఇంటర్ విద్యార్థులకు) సుమారు రూ.2 లక్షల విలువైన యాంటీ హిమోఫిలియా ఫ్యాక్టర్ 8, 9 ఇంజెక్షన్లను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వైద్యం గౌతమ్, అంబీ శ్రీనివాస్ బుధవారం పంపిణీ చేశారు. మార్చిలో పరీక్షలు జరగనున్న పదవ తరగతి విద్యార్థులకు కూడా మందులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హిమోఫిలియా సొసైటీ వరంగల్ చాప్టర్ జనరల్ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్, సభ్యుడు సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

వరంగల్ చౌరస్తా: ప్రజలు, రైతులు, కార్మికులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాచర్ల బాలరాజు, కోరబోయిన కుమారస్వామి, వీరగోని శంకరయ్య, సుంచు జగదీష్, ఐలయ్య, ఫణి, బషీర్, పాషా, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు అభినందనలు




వరంగల్: వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఇటీవల విధుల్లో చేరిన జి.సంధ్యారాణిని వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి పాలకూరి సదానందం, ఉపాధ్యక్షుడు దుర్గారావు, రాజు, సిటీ యూనిట్ కార్యదర్శి మధుచంద్ర, జిల్లా సంయుక్త కార్యదర్శి రమాదేవి, మధు, జిల్లా బాధ్యులు భరత్, ప్రశాంత్, శ్వేత, కార్తీక్, చందు, నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డీటీసీ, ఆర్టీఓలకు సన్మానం



ఖిలా వరంగల్: ఇటీవల బాధ్యతలు చేపట్టిన హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్, వరంగల్ ఆర్టీఓ విజయ లక్ష్మిని వరంగల్ జిల్లా వడుప్సా ప్రతినిధులు, కాకతీయ టూరిస్ట్ బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో లక్కం శ్రీధర్, అనిశెట్టి శ్యామ్, పెరుమాండ్ల అనిల్‌గౌడ్, సునీల్ రాజ్, వడుప్సా జిల్లా ప్రెసిడెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి, బొశెట్టి వెంకటేశ్వర్లు, రాంమూర్తి, కొమ్మినేని భూపాల్‌రావు, బొల్లం కనకయ్య, విలియమ్స్ జన్ను, యాదా విద్యాసాగర్ పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో లక్ష్మీగణపతి హోమం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో బుధవారం లక్ష్మీగణపతి మూలమంత్రం హవనంతో హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సాగనున్న హోమాన్ని గణపతి పూజతో ప్రారంభించారు. త్రిగుళ్ల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహిస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లి తిరుగు పయనంలో శ్వేతార్క ఆలయాన్ని దర్శించుకుంటున్న భక్తులకు మూడు రోజులుగా నిత్య అన్నదానం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శశిధర్‌రావు

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్‌రావు మాట్లాడుతూ మాతృభాషను మరిచిపోతే మాతృమూర్తిని మర్చిపోయినట్లేనని అన్నారు. తమ భాషపట్ల అంకితభావం, పట్టుదల పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో చదువుకున్న వాళ్లకు మానసిక పరిపక్వత బాగా పెంపొందుతుందని వివరించారు. ఈ సందర్భంగా కొత్తవాడలోని బ్లూమ్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సీకేఎం కళాశాలకు వచ్చి జువాలజీ, బోటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో ఉన్న మ్యూజియం, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో బ్లూమ్స్ కళాశాల కరస్పాండెంట్ రాజేందర్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయలక్ష్మి, డాక్టర్ ధర్మయ్య, తెలుగు విభాగం అధ్యాపకులు కృష్ణవేణి, శాఖమూరి రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో..

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్‌లో మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్యరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి హిమబిందు, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



విద్యారణ్యపురి: విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (పెట్రోల్ పంపు) స్వయపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు.. హెచ్ఎంగా, ఉపాధ్యాయులుగా, పీఈటీగా, డీఈఓగా వ్యవహరించి ప్రతిభను చాటారు. తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సయ్యద్ యూసుఫ్, అయేషాఫర్వీన్, శోభ, వెంకటలక్ష్మి వ్యవహరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పద్మావతి ఉపాధ్యాయులు జిలుకర ఏకాంతం, హజేరా, భాస్కర్, మోజెస్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

హన్మకొండ: హసన్‌పర్తిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, విద్యాశాఖాధికారులుగా వ్యవహరించి అద్భుతమైన పాత్ర పోషించారు. ఉపాధ్యాయులుగా తోటివారికి పాఠ్యాంశాలను బోధించారు. కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, చకిలం రాజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి పేటలో గద్దెపైకి సారలమ్మ



సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు

కరీమాబాద్: వరంగల్ పరిధిలోని అమ్మవారిపేట సమ్మక్క, సారలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతరలో భాగంగా వరంగల్ ఉర్సు నుంచి సారలమ్మను పూజారులు అమ్మవారిపేట జాతర ప్రాంగణంలోని గద్దె వద్దకు బుధవారం తీసుకొచ్చారు. కార్యక్రమంలో జాతర కమిటీ బాధ్యులు కోడూరి భిక్షపతి, దాసి రాందేవ్, నాగరాజు, హరినాథ్, కుమారస్వామి, రాంమ్మూర్తి, సునీత, ప్రకాశ్‌లతోపాటు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, గౌతం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైపు మార్నేని చూపు..?



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ మార్నేని రవీందర్ రావు కాంగ్రెస్‌లో చేరనున్నారని ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నాయకులతో వరుస భేటీలు ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది. ఈనెల 20న హైదరాబాద్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, సీఎం ముఖ్య సలహాదారుడు వేం నరేందర్ రెడ్డికి మార్నేని కలిశారు. అలాగే, హనుమకొండలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని బుధవారం కలిశారు. గతంలో వారంతా తెలుగుదేశం పార్టీలో కొనసాగారు.

చట్టసభల్లో బీసీలకు వాటా కల్పించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

హన్మకొండ: చట్టసభల్లో ఓ బీసీలకు వాటా కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీసీ మహా పాదయాత్ర కరపత్రాలను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో తామెంతో చట్టసభల్లో ఆ మేరకు వాటా కల్పించాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మిరుగోన్‌పల్లి నుంచి మార్చి ఒకటిన బీసీ మహా పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ వైస్ చైర్మన్ వెలుగు వనితక్క, ఆయా సంఘాల నాయకులు డాక్టర్ చిత్తం ప్రవీణ్ కుమార్, ఏటిగడ్డ అరుణక్క, చాపర్తి కుమార్ గాడ్గే, పద్మజాదేవి, దిడ్డి ధనలక్ష్మి, సద్గుణ, కూనూరు రంజిత్ గౌడ్, ఐతం నగేష్, రాచకొండ ప్రవీణ్ కుమార్, సిద్ది రాజుయాదవ్, గోధుమల కుమారస్వామి, కూరాకుల భారతి, చంటి ముది రాజ్, సూర ప్రవంతి పాల్గొన్నారు.



ఆత్మవిశ్వాసంతో శిక్షణ పూర్తి చేసుకోవాలి



శిక్షణార్థులతో రాచకొండ సీపీ తరుణ్ జోషి

మామునూరు : పోలీసు శాఖలో కష్టపడి ఉద్యోగం సాధించిన కానిస్టేబుల్ అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో 9 నెలల శిక్షణను పూర్తి చేసుకోవాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి సూచించారు. బుధవారం ఖిలావరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో 9 నెలలు నిర్వహించే శిక్షణకు 300 మంది ఏఆర్ కానిస్టేబుల్ అభ్యర్థులు హాజరయ్యారు. సీపీ తరుణ్ జోషి ముఖ్యఅతిథిగా హాజరై కమాండెంట్ శివప్రసాద్‌తో కలిసి శిక్షణాశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఉద్యోగి దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని, శిక్షణ కఠినంగా ఉన్నా పట్టుదలతో పూర్తి చేయాలన్నారు. కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీ శ్రీనివాస్‌రావు, రాంబాబు, ఆర్ఐలు శోభన్, వెంకటేశ్వర్లు, చంద్రన్న, రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి

వరంగల్ అర్బన్/ఖిలా వరంగల్: బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం వరంగల్ స్టేషన్ రోడ్డులోని మహేశ్వరీగార్డెన్, రైల్వే గేట్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్స్‌లో రెవెన్యూశాఖ, స్త్రీ శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, విద్యార్థికి 4జీ మొబైల్, దివ్యాంగులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ హాజరై కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. సమావేశంలో తహసీల్దార్లు ఇక్బాల్ అహ్మద్, బండి నాగేశ్వర్‌రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, నాయకులు శ్రీనివాస్, ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు అవమానం..

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ సందర్భంగా ఆయా డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు స్టేజీపైకి రావాలని మంత్రి ఆహ్వానించారు. కాని అప్పటికే స్టేజీపై ఏర్పాటు చేసిన కుర్చీల్లో మొత్తం కాంగ్రెస్ పార్టీ నాయకులతో నిండిపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కిందనే ఉండిపోయారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించిన సమయంలో స్థానిక కార్పొరేటర్లకు తగిన ప్రాధాన్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు మంత్రి కొండా సురేఖ, అధికారులకు విజ్ఞప్తి చేశారు.



విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

హన్మకొండ: బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండలోని బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న కాకతీయ భద్రకాళి విజయ సంకల్పయాత్ర భద్రాచలంలో ప్రారంభమై, మార్చి 1న జనగామలో ముగుస్తుందని చెప్పారు. యాత్రకు ప్రజలంతా సంపూర్ణ మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యాత్ర ప్రముఖ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ మంత్రి విజయ రామారావు, మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ పార్లమెంటరీ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్ పాల్గొన్నారు.

పోలీస్ జాగిలానికి నివాళి

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో డాగ్ స్క్వాడ్ విభాగంలో 8 సంవత్సరాలుగా సేవలందించిన పోలీస్ జాగిలం స్వీటీ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృత్యువాత పడింది. దీంతో ఆర్ఐలు స్పర్జన్స్, శ్రీధర్‌తో పాటు డాగ్ స్క్వాడ్ విభాగానికి చెందిన సిబ్బంది స్వీటీ కళేబరంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు. హ్యాండ్లర్ యాకరాజు పర్యవేక్షణలో సేవలందించిన పోలీస్ జాగిలం మృతిపై సీపీ విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ప్రభాకర్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: వంగపహాడ్ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు వెళ్లి సౌకర్యాలపై ఆరా తీశారు. సొంత నిధులతో టాయిలెట్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. జాతీయ రహదారిపై ఫ్లెఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పాటుపడుతానని ఎమ్మెల్యే అన్నారు.

సంక్షిప్తంగా


ప్రభుత్వ భూములను కాపాడండి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ న్యూశాయంపేట పరిధి 579, 599 సర్వేనంబర్లలోని కందులబండ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకుని రెండేళ్లుగా జీవిస్తున్నారని చెప్పారు. ఆ భూమిని కాజేసేందుకు భూకబ్జాదారులు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, భూక్య కల్పన, లలిత, సుజాత, శిరీష, ఉమా, రజిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమ్మేళనానికి తరలిరావాలి

విద్యారణ్యపురి: దేశపాలకుల విధానాలు – నేటి యువత కర్తవ్యం అనే అంశంపై ఈనెల 28న వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రీ పిలుపునిచ్చారు. ఈమేరకు సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర, బాధ్యులతో కలిసి హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మస్క సుధీర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్, వరంగల్, హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్, మతిన్, శ్రీకాంత్, మనోజ్, సుమన్ పాల్గొన్నారు.

వైభవంగా పెద్దల పండుగను జరుపుకుందాం..



ఖిలా వరంగల్: ఈనెల 25న షబేబరాత్ (పెద్దల) పండుగను వైభవంగా జరుపుకుందామని హజ్రత్ సయ్యద్ జానుల్లా షమీద్ దర్గా అధ్యక్షుడు ఎంఏకే తన్వీర్ అన్నారు. కబ్రస్థాన్‌లలో పెద్దల సమాధులను దర్శించుకునేందుకు పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని బల్దియా చేపట్టినట్లు తెలిపారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీదులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బేగ్, నూరొద్దీన్, షఫీయొద్దీన్, మహిమూద్, సయ్యద్ ఆరీపొద్దీన్, రబ్బానీ, షేక్ హసన్, సంజరి, రబ్బాని, ముఖిత్ ఖాన్, ఖయ్యుం, ఎస్‌కే.హుస్సేన్, హఫీజ్, ఎంఎం.తహీర్ పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్‌ను హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా వినయ్‌కుమార్, బాధ్యులు హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ బాధ్యులు వరుణ్‌బాబు, సయ్యద్ మినాజ్ హుస్సేన్, సయ్యద్ ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై విజయ్‌కుమార్‌కు సన్మానం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా బుధవారం సన్మానించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయ్‌కుమార్ పాల్గొని బంగారు పతకం సాధించారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

ఖిలా వరంగల్: ఆర్టీఏ జంక్షన్‌లో మేడారం భక్తులకు వాటర్ బాటిళ్లను మిల్స్‌కాలనీ పోలీసులు, సామాజిక కార్యకర్తలు బుధవారం పంపిణీ చేశారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వరంగల్: బిహార్‌కు చెందిన వలసకూలీ సరోజకుమార్ తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు ఏనుమాముల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ సహకారంతో వెతికి బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డుపై బోరు వేయొద్దని ఆందోళన

ఖిలా వరంగల్: వరంగల్ కాశికుంట కాలనీలో ఓ ఇంటి యజమాని రోడ్డుపై బోరు వేసేందుకు బుధవారం సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని బోరు వేయొద్దని ఆందోళన చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బోరు పనులను నిలిపివేశారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ సమీపంలోని హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్మశాన వాటిక నిర్వాహకుడు అరూరి సాంబయ్య, నాయకులు గొర్రె సంజీవ, సిరిపాక కుమార్, బొడ్డు సదానందం తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' కొనసాగించాలి

నయీంనగర్: దళితబంధు పథకాన్ని కొనసాగించాలని దళిత జన సంక్షేమ సంఘం అధ్యక్షుడు గబ్బెట బాబు కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ దళితుడికి రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం, నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తీకరించే సామర్థ్యం పెంపునకు స్పీకథాన్

హన్మకొండ: బహిరంగంగా మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ఆలోచనలను ప్రేక్షకుల ముందు ప్రభావవంతంగా వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంపొందించే వేదికను అందించడమే స్పీకథాన్ కార్యక్రమం ఉద్దేశమని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్ రెడ్డి అన్నారు. హసన్‌పర్తిలోని కిట్స్ కళాశాలలో స్పీకథాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 'స్టూడెంట్ ట్రైబ్ అండ్ సెయిల్' ద్వారా నిర్వహించిన స్పీకథాన్‌లో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా నరేందర్ రెడ్డి, ఫిజికల్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకరాచారి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీన్‌లు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో బోరు మోటార్ ఏర్పాటు

మడికొండ: మడికొండ మెట్టుగుట్ట కింద ఉన్న శ్మశాన వాటికలో బోర్‌లో మోటార్‌ను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు ఉన్న మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో కర్మలు చేయడానికి వచ్చే వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొనేవారు. దాంతో గ్రామానికి చెందిన నాయకుడు వస్కుల శంకర్ ముందుకువచ్చి తన సొంత ఖర్చుతో మోటార్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, గుర్రం అమర్‌నాథ్, దువ్వ విజయ్, పల్లపు అర్జున్, గడుసు రాజు, వస్కుల బాబు, శ్రీనివాస్, వేణు, సుమన్, గౌతమ్, రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎఫ్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత ఒలింపియాడ్‌లో హనుమకొండ బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని పాఠశాల సెక్రటరీ చిదురాల సోమరత్నం తెలిపారు. ఈమేరకు విద్యార్థులు గుండాల జయనందన్ రెండవ ర్యాంకు, రావుల గగనశ్రీ నాలుగవ ర్యాంకు, అడునూరి హరిణి, బొమ్మగాని సాత్విక్, తోకల సాయినాథ్ ఉత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. కాగా, వారిని డీసీపీ అబ్దుల్ బారి బుధవారం అభినందించారు.

ఒలింపియాడ్, స్పెల్‌బీలో..

నయీంనగర్: 6వ డివిజన్ కిషన్‌పుర మాస్టర్‌జీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్, స్పెల్‌బీ పోటీల్లో మాస్టర్‌జీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రజిత తెలిపారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీ టికెట్ మహిళకు కేటాయించాలి

హన్మకొండ చౌరస్తా: వరంగల్ ఎంపీ టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ మహిళకు కేటాయించాలని దళిత రైట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మోకినపల్లి జ్ఞానసాగర్ విజ్ఞప్తి చేశారు. హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో వివిధ ప్రజా సంఘాల సమావేశం బుధవారం జరిగింది. కార్మిక శాఖ రిటైర్డ్ అధికారి, మహిళా కాంగ్రెస్ దళిత నాయకురాలు కూరాకుల భారతికి సీటు కేటాయిస్తే గెలిపించుకుంటామని తీర్మానించారు.